# మామయ్య వస్తాడు

ఉన్నవ విజయలక్ష్మి

నాన్న ఉత్తరం వ్రాశారు — మామయ్య వస్తున్నాడుట. ఆఫీసు పనేదో వుందట —

ఉత్తరంలో సంగతులన్నీ సంబరంగా చెప్పుకు పోతూంటే, "ఇంతకీ ఆయన వచ్చేది ఎప్పుడూ." అంది హేమ.

"పదిహేనో తారీఖు, బుధవారం, అంటే రేపే." అన్నాను ఓసారి చేతిలోవున్న కాగితంవంకా, మరోసారి గోడమీది క్యాలెండరువంకా చూసి ఇంక సందేహం ఏమీ లేదు అన్న ధోరణిలో.

"రేపేనా - ఇంకా ఏం వ్రాశాడు - ఏదీ, ఇటివ్వండి." అంటూ నా చేతిలో ఉత్తరం తీసుకుంది.

ఈ సీతాపతి మామయ్య మా అమ్మకి స్వయానా తోబుట్టినవాడేం కాదు. పినతల్లి పెదతల్లి పిల్లలు - చిన్నతనంలో బాగా కలిసిమెలిసి వుండేవాడట. ఇప్పుడయినా కలుసుకున్నప్పుడు అభిమానంగానే వుంటాడు. ఎటొచ్చీ ఆ కలుసుకోటమే సంవత్సరాల తరబడీ పడకుండా వుంటుంది - నేను మామయ్యని చూసిబదారేళ్ళపైనే అయింది.

ఇటూ అటూ ఎన్ని కుటుంబాలని ఎటునుంచి ఎటు చూసినా, వున్నంత లోగుట్టుగా కాలక్షేపం చేసుకుంటూ పోతున్న మా బంధువులలో సీతాపతి మామయ్య అదృష్టాన్నిగురించి ప్రత్యేకం చెప్పుకో వలసిందే - పదిహేను సంవత్సరాలకి పైగా ఢిల్లీ, కలకత్తా, బొంబాయి నగరాల్లోనే అతని మకాం - పెద్ద వుద్యోగం, గౌరవం, హోదా అన్నీవున్న అదృష్టవంతుడు.

ఆ మధ్య బదరీ యాత్ర చేసుకువస్తూ పది రోజులపాటు ఢిల్లీలో మామయ్యగారింట్లో వుండి వచ్చిన సుబ్బులు దొడ్డమ్మ అక్కడి విషయాలన్నీ చెప్తూంటే వినడానికి మాకందరికీ ఎంతో ఆసక్తిగా వుండేది.

"మా కాంతమ్మత్త రోజూ కట్టుకునే చీరలు నూరు రూపాయలకి తక్కువ ఖరీదు చెయ్యవనీ - వాళ్ళింట్లో రోజూ ఐస్క్రీం చేసుకుంటారనీ — మామయ్య పిల్లలు మాలతీ, మాధవ్ స్కూలునించి రాగానే వంటవాడు పెట్టిన టిఫిన్ తినేసి మళ్ళీ హాయిగా ఏ టెన్నిసో ఆడుకోటానికి వెళ్ళిపోతా



లనీ, వాళ్ల క్లాసు పుస్తకాలు చదువుకుంటూ కూడ సరదాగా ట్రాన్సిస్టరు వింటూనే వుంటారనీ, వారానికి మూడు సినిమాలయినా చూస్తారనీ..." చెప్తూంటే మేమంతా నోళ్లు వెళ్ళబెట్టుకుని మరీ వినే వాళ్ళం - ఏమీ తోచనప్పుడు కాసేపు రేడియో పెట్టినందుకూ, నెలకి రెండు సినిమాలు చూసినందుకూ నాన్న చేత లక్ష చివాట్లు తింటూ చిన్నతనం అంతా గడిపిన మేము మామయ్య పిల్లల్ని తల్చుకుని అసూయపడుతూండేవాళ్ళం—

మామయ్య ఎప్పుడూ మీటింగులు, టీపార్టీలూ అంటూ ఒక్క క్షణం అయినా తీరుబడి అనేది లేకుండా బిజీగా వుంటాడుట. అందుకే అనుకుంటా అతను బంధువుల ఇళ్ళకి రావటం అదీ తక్కువే. శుభకార్యాలప్పుడు కూడ ఏదో ఓ బహుమతి గ్రీటింగ్సు పంపటమే కాని ఆ కుటుంబం వచ్చిన సందర్భాలు చాలా తక్కువే. ఇప్పుడు కాస్త తీరిక చిక్కిందేమో, సత్యం మామయ్య కూతురి పెళ్ళికి వచ్చినట్లున్నాడు. నాన్న నా విషయం అంతా చెప్పి ఏదైనా సహాయం చెయ్యమని చెప్పారన్నమాట.

'అతను తప్పకుండా ఏదో ఒకటి చేస్తాడు. ఆ నమ్మకం నాకుంది " అంటూ నాకు ధైర్యం చెప్తూ వుత్తరం వ్రాశాడు. అతను ఏ హోటల్లో దిగుతాడో వ్రాసి. 'నువ్వు ఎప్పుడో హోటలుకి వెళ్ళి చూస్తేకాదు. ఉదయం స్టేషనుకే వెళ్ళి కలుసుకో.' అంటూ సలహా ఇచ్చాడు—అయననంతా చాద స్తంకాని నాకు అమాత్రంతెలియదూ.

'నాకు మంచిరోజులు వచ్చాయి - అందుకే మామయ్య ఈ వూరు రావటం పడింది." అనుకున్నాను మనస్సు ఎంతో హాయిగా వుంది.

'ఇదుగో—ఆయన పుణ్యమా అని మంచి వుద్యోగం దొరికితే మనం అన్నీ కొనుక్కోవాలండీ-ఓ ఫేను, సోఫాసెట్టు..." అంటూ హేమ చెప్తూంటే.

'అవన్నీ తరువాత—ముందు చేయాల్సిన పని ఈ దిక్కుమాలిన కొంప మార్చేయాలి—ఎవరైనా ఇంటికి వస్తారంటేనే ప్రాణం చచ్చిపోతోంది ' అన్నాను. అవును మరి - మామయ్య హోటల్లో దిగినా ఒక్క పూటయినా మా యింటికి పిలవక పోతే బాగుండదుకదా- "ఈ ఇంట్లో నువ్వు ఎలా కాపురం చేస్తున్నావురాబాబూ " అని అతను నోరు తెరచి అనకపోవచ్చు, కాని అతని బంగళాలో సర్వెంట్సు, క్వార్టర్సుకూడా మా యింటికంటె మెరుగ్గా వుంటాయేమో అన్న ఆలోచన చాలు నా తల సిగ్గుతో వాలిపోయేలా చెయ్యటానికి.

మేం మాత్రం సంతోషంగా సరదాగా ఈ ఇంట్లో వుండగలుగుతున్నామా-ఆరు నెలలు నానా అవస్థలుపడ్డాక ముప్పైరూపాయలఅద్దెకో ఈమాత్రం ఇల్లయినా అంటే ఓ గది, వంటగది వున్న భాగం కంటబడిందే చాలునని ఎడ్వాన్సు యిచ్చి బుక్ చేసేశాను. వెంటనే హేమను పిలిపించుకున్నాను. ఇక్కడ నచ్చకపోవటం ఒకటేకాదు. ఇరుగూ

స్నేహపాత్రులు ఎవ్వరూ మాకు కనుపించలేదు. వాళ్ల మాత్రం మాతో స్నేహం చేసుకోవాలనీ మకి పూసుకుతిరగాలనీ తాపత్రయ పడుతూంటారు కాని నేనూ హేమా మాత్రం కాస్త ముభావంగానే వుంటూంటాం.

'ఈ మహాపట్టణంలో ఈ పాడుపడిపోయిన కొంపతప్ప మరేమీ కనిపించలేదా. పోనీ అంటే మంచి తోడూలేదు - మీరు ఆఫీసునుంచి వచ్చే దాకా ఒక్కదాన్ని బిక్కుబిక్కు మంటూ కూర్చోవాలి." అంటూ మధ్య మధ్య హేమ విసుక్కుంటూండేది.

నేనూ ఈ రెండేండ్లనుంచి మరో మంచి ఇంటి కోసం ప్రయత్నం చేస్తూనేవున్నాను. నాకు అన్ని విధాల నచ్చింది నాకు అందుబాటులో లేకపోవటం వల్లే నా ప్రయత్నాలు ఒక కొలిక్కి రాలేదు - సరే మూడునెల్లయింది. ఆ నూటయాభై రూపాయల ఉద్యోగం కూడ వూడిపోయింది - వాళ్ళు ఇచ్చిన గ్రాట్యుటీతో మెల్లిగా కాలక్షేపం చేస్తూ మరో ఉద్యోగం కోసం తిరుగుతూనేవున్నాను. అప్లికేషన్లు పంపించటం, ఆఫీసులవెంట తిరగటం,

ooooooooooooooooooooooooooo

మహిళామండలి సమావేశంలో ఇష్టాగోష్టి:- "మగవారిలోకూడాకొంతమంది తెలివయినవారు వుంటారుగదా, మరి వుత్త బుద్ధిహీనులే మనకి భర్తలుగా దొరుకుతుంటారేం చెప్మా"

తోటమాలి :- "ఎంచేతంటేనండి అమ్మగోరూ బుద్ధివున్న మగవాడు అసలు పెళ్ళే చేసుకోడండి మరి."

ooooooooooooooooooooooooooo

వాళ్ళని వీళ్ళని కలుసుకోవటమే మిగిలింది. కాని ఉద్యోగంమాత్రం దొరకలేదు మొన్న నూరీఇచ్చింది అయిపోతే సూర్యం దగ్గర ఓ యాభై అప్పుకూడ తీసుకున్నాను - అయినా ఈ హైదరాబాదులాంటి ఊళ్ళల్లో కూర్చుని అప్పులు చేసుకుతింటూ ఉద్యోగం వెతుక్కోటం అంటే మాటలా - సంసారం అదీ ఎత్తిపెట్టేసి ఇంటికి వెళ్ళిపోయి ప్రయత్నాలేవో చేసుకుంటే బాగుంటుంది అనుకున్నాం కూడ. సరిగ్గా సమయానికే వస్తున్నాడు మామయ్య-అతని పలుకుబడితో సిఫారసుతో ఏదో ఒకటి దొరక్కపోదు. ఏ క్లబ్బు స్నేహితుడికయినా, ఏ ఆఫీసు పరిచయస్థుడికయినా చిన్నమాట చెప్పాడంటే చాలు పని జరిగిపోతుంది - బట్టాబుట్టా పెట్టుకుని మళ్ళీ ఇంటికి తిరిగివెళ్ళే ప్రమాదం తప్పిపోయింది మాకు.

మామయ్యని గురించి కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే అసలు పూట అన్నంకూడా తినాలనిపించలేదు మాకు. చేసుకున్నవి పచ్చడి మెతుకులే అయినా పంచభక్ష్య పరమాన్నాలు తిన్నంత

పెట్టి తెరిచి చూశాను. ఉత్సాహం అంతా చప్పబడిపోయింది.

"స్టీలుగిన్నెలు కొంటాను" అంటూ హేమ జాగ్రత్తచేసిన పాతబట్టలు తప్ప మర్నాడు వేసుకు వెళ్ళటానికి పనికొచ్చేవేవీ లేవేలేవు అందులో - స్టాండుమీద జత తీసుకుచూశాను. మూడురోజుల నుంచి అవి వేసుకుని బస్సుల్లోపడి ఆఫీసులవెంట తిరగటంతో అవి పూర్తిగా నలిగి మాసిపోయాయి.

'దోబీవచ్చి ఎన్ని రోజులయింది"- వంటింట్లో వున్న హేమకి వినిపించేలా విసుగ్గా అడిగాను.

"ఏం? బట్టలులేవా ?" — ఏదో పనిచేసుకుంటూ అక్కడ్నించే అడిగింది.

"ఎలా వుంటాయి - రోజుల తరబడీ చాకలిరాకపోయినా పెట్టినిండా బట్టలుండటానికి నాకేం డజన్లకొద్దీ పాంట్లు షర్టు వున్నాయా ?"

"బట్టలు తీసుకువెళ్ళి పదిహేను రోజులు కావస్తోంది - ఇవాళో రేపో రావాలిమరి." వంటగది వదిలి ఇవతలకివస్తూ మెల్లిగా అంది.

'ఆ వస్తాడులే - మామయ్య వచ్చి వెళ్ళిపోయాక, ఈ అవసరం అంటూ గడిచిపోయాక అప్పుడు వస్తాడు." అంటూ చిరాకుపడిపోయాడు.

'రేపటికికదా మీకు బట్టలు కావాలి - మరేం పరవాలేదు - ఓ జత సబ్బులో నానపెట్టి వుతికి ఆరవేస్తాను. ఆ ప్రక్క లాండ్రీలో ఇస్త్రీ చేయించుకుందురుగాని." ఉపాయం చెప్పింది అర్ధాంగి.

ఊరికే చిరాకు పడిపోయానేగాని అంతవరకూ నాకు ఆ ఆలోచనే రాలేదు. 'అంతే మరి-అలాగే చెయ్యి." అంటూ స్టాండుమీదివి ఓ జత తీసి ఇచ్చాను.

తను వాటిని వుతికి, ఆరవేసిం తరువాత ఇద్దరం కలిసి గదిని సాధ్యమైనంత అందంగా అలంకరించాం. మంచంమీది దుప్పటి తీసేసి మరో దుప్పటి వేశాం - హేమ ఏనాడో ఎంబ్రాయిడరీ చేసి పెట్టెలో దాచిన గలేబులు తలగడలకి తొడిగాం - పెట్టెలురెండూ ఓ దానిమీద ఒకటి పెట్టి పైన ఓ టేబిల్‌కాత్ వేశాం - అలమారులో వుంచేసిన ఫ్లవరువాజూ ప్లాస్టిక్‌పూలగుత్తీ తీసి ఆ పెట్టెల టేబిలుమీదపెట్టాం.

"రేపు ఉదయం వంటకా లేమిటి చెయ్యటం?" అంది హేమ మధ్యలో గుర్తువచ్చి.

'రేపు స్టేషనుకి వెళ్ళి కలుసుకునే దాకా అతని ప్రోగ్రాం ఏమిటో మనకి తెలియదు - ఉదయం రావటానికి వీలుకాదు. రాత్రి వస్తా నంటాడేమో, రోజంతా మీటింగులు అవీ వుంటాయి కదా !" అన్నాను.

'ఆయన ఎప్పుడు వచ్చినా రెండు కూరలు, పచ్చడి, సాంబారు చేసి ఏఅప్పడాలువేయిస్తే బాగుంటుంది. సరే ఒక స్వీటుహాటు వుండకపోతే బాగుండదు కదా- సాయంకాలం బజారుకి వెళ్ళి అన్నీ తెచ్చుకుందాం" అంది.

మేం ఇంటో ఎలా తినా అతిది వస్తునప్పు

రూపంగా వాడుకుంటున్న డబ్బే అయినా మాకంత బాధ అనిపించలేదు - ఈ వుద్యోగ ప్రయత్నాల్లో కావలసిన ఇన్‌ఫరమేషన్ తెలుసుకోటానికి నానా అవస్థలూ పడుతూ, ముక్కూ మొహం తెలియని వాళ్లని కూడా హోటళ్ళకి తీసుకువెళ్ళి కాఫీ ఫలహారాలు ఇప్పించిన సందర్భాలు వున్నాయి. అలాంటిది మామయ్యఅంతటివాడు వస్తూవుంటే నాలిక్కి అయిదుకి మొహం చూసుకుంటామా.

"ఎల్లుకూడ ఏమైనాతీసుకుంటేబాగుంటుందేమో" అంది హేమ - ఎంతయినా ఇలాంటి మర్యాదలన్నీ ఆడవాళ్ళకే బాగా తెలుస్తాయి.

"నిజమే-సమయానికి జ్ఞాపకంచేశావు "అంటూ పళ్ళ దుకాణం వేపు నడకసాగించాను

రెండు రూపాయల కాగితం వాడి చేతులోపెట్టి రెండు యాపిల్‌పండ్లు తీసుకుని ఇంటిదారి పట్టాం.

ఇంకా బాగా తెల్లవారలేదు-పొరుగు వారి కోడి వుండి వుండీ చెవులు అదిరిపోయేలా కూస్తోంది— అప్పుడే పాల వేన్ వచ్చినట్లుంది. పాలకోసం వచ్చిన వాళ్ళు ఆ సీసాలకోసం ఎగబడుతూ మధ్య మధ్య పోట్లాడుకుంటున్న గొడవ రోడ్డుమీదనుంచి వినిపిస్తోంది-భర్త వెళ్ళేవేళ్టికి పని తెమలదేమో అని హడావిడి పడిపోయే గృహిణి చీకటితో లేచి చక చకా పనులు చేసుకుంటూ గబ గబ నీళ్ళు తోడుకుంటున్నట్లుంది - బావి గిలక కిర్రు కిర్రున చప్పుడుచేస్తోంది.

ఆదివారం కెప్పుడయినా అలాంటప్పుడు మెలకువ వస్తే, 'ఛ-వెధవ గొడవ-తెల్లవారిందాకా కంటి నిండా నిద్ర కూడా వుండదు" అని తెగ విసుక్కునే నేను హుషారుగా లేచి కూర్చున్నాను.

"అలారం కొట్టకుండానే లేచిపోయారే." అంటూ హేమ కూడ లేచింది.

'అసలు నిద్ర పట్టందే-ఎప్పుడెప్పుడు లేద్దామా అని అలా కళ్లు మూసుకు పడుకున్నానంతే." అంటూ అలమారులోంచి టూత్ పేస్టు. బ్రెష్ తీసుకున్నాను.

గబ గబ మొహం కడుక్కువచ్చి. రెండు స్టౌలు అంటించి ఓ దానిమీద స్నానానికి నీళ్ళు పడేసి. మరో దానిమీద కాఫీ కాచే ప్రయత్నంలో పడింది హేమ.

నేను స్టేషను చేరుకునేసరికి. ట్రైను రావటానికింకా పదిహేను నిమిషాల పైనే టైముంది. ప్లాటుఫారం టిక్కెట్టు తీసుకుని లోపలికి వెళ్ళి కాస్సేపు అక్కడ సిమెంటు బెంచీ మీద కూర్చున్నాను. టైము ఎంతకీ గడపటంలేదనిపించింది. లేచి ప్లాటుఫారం ఈ చివరనుంచి ఆ చివరిదాకా పచార్లు చెయ్యటం మొదలుపెట్టాను. అలా తిరుగుతున్నప్పుడు నాకు తెలిసిన వాళ్ళెవరైనా కనిపిస్తే బాగుండుననీ. వాళ్ళని పలకరించి ఇదుగో నేను ఫలానా ఆయనకోసం వచ్చాను అంటూ ఆయన ఉద్యోగం. హోదా అన్నీ గొప్పగాచెప్పి ఆయన ఎవరోకాదు మా మామయ్యే అని గర్వంగా చెప్పుకోవాలనీ ఓ చిత్రమైన కోరిక కలిగింది.ఎవరైనా కనిపిస్తారేమోనని ఆశగా అటూ ఇటూ చూశాను కూడా-ఉహూ-ఒక్క మొహం కనిపించలేదు. అంతలో గంట కొట్టటం ఇక్కడా అక్కడా తచ్చాడుతున్న వాళ్ళంతా బిలబిల్లాడుతూ ముందుకు రావటం జరిగింది.

ట్రైను దడదడ శబ్దం చేసుకుంటూ ప్లాటుఫారం సమీపిస్తూంటే నా గుండెలు నాకే అర్థంకాని అనుభూతితో దడదడ లాడటం మొదలుపెట్టాయి ట్రైను పూర్తిగా ఆగకుండానే లోపలివాళ్ళు కిటికీ లోంచి తలలు బయటకుపెట్టి ఆత్రంగా చూస్తున్నారు తమని రిసీవ్ చేసుకోటానికి వచ్చేవారికోసం ప్లాటుఫారం మీద వున్నవాళ్ళు ట్రైనువెంటనడుస్తూ తమవారు కనిపించగానే పలకరింపుగా చిరునవ్వులు నవ్వుతున్నారు. నా చూపులు ఆత్రంగా అటూఇటూ పరుగులుపెట్టి ఒక దగ్గర ఆగిపోయాయి. ఫస్టు క్లాసు కంపార్టుమెంటు గుమ్మంలో నిలబడి చిరునవ్వుతో ఎవరినో పలకరిస్తున్న వ్యక్తిని చూసి.

"ఆ అతనే" అనుకుంటూ పరుగులాంటి నడకతో ఆకంపార్టుమెంటు దగ్గరికి చేరుకున్నాను.అప్పటికి రైలు ఆగింది. అతను క్రిందికి దిగాడు. పదిమంది సూటు వాలాలు అతనిచుట్టూ మూగిపోయారు. వాళ్ళందరి మధ్య మబ్బురంగు సూటు మెరూన్‌కలరుటైతోహుందాగా నిలబడినమామయ్య నాకళ్ళకి చుక్కలలో చంద్రుడిలాగే కనిపించాడు. అప్రయత్నంగానే ఒకసారి నా బట్టలవంక చూసుకున్నాను. రెండు గంటలసేపు సబ్బులో నానపెట్టి ఆ తరువాత రెక్కలు ముక్కలయి పోయేలా వుతికి ఆరవేసింది హేమ. అర్ధరూపాయి ఇచ్చి అర్జంటుగా ఇస్త్రీ చేయించి తెచ్చుకున్నాను - అయినా

## తెలిసినవిషయం తెలియనివివరం

### వాల్ స్ట్రీట్

ఈ పేరు వినగానే పెద్ద పెట్టుబడిదారులు 'స్టాక్ ఎక్స్ఛేంజ్ మెర్లాన్ ధనవంతులు నిద్రలోకూడా త్రుళ్ళిపడి లేచి కూర్చుంటారు. ప్రతిదినం హిందూ పత్రిక చేతికి అందగానే ఎన్నికల ఫలితాలను గురించిగాని. కెయిరిన్ ప్రభుత్వంలో జరుగుతూవున్న పరిస్థితులను గురించిగాని వీరు గమనించరు. వీరు తొందర తొందరగా నాల్గవ పేజీ తిప్పి అక్కడ "ఫైనాన్సు అండ్ కామర్స్" శీర్షిక కింద అంకెల మహిమతో ప్రచురించబడేపంక్తులనుచదువుతారు. ఆ అంకెలలో ఏముంటుందా అని మనం ఆశ్చర్యపోతాం. అయితే ఆ అంకెలు కుబేరులనిగా లేక కుచేలురనిగా చేస్తాయి. అనే విషయాలు మనకు అనవసరం. ఆ అంకెల మధ్య అక్కడక్కడ 'వాల్‌స్ట్రీట్'ను గురించి తడుముతూ వుండటం కనిపిస్తూంది.

'వాల్‌స్ట్రీట్' న్యూయార్కు నగరంలోని తూర్పు భాగంలో నున్న ఒక వీధి. అమెరికాలలోని పెద్ద బ్యాంకులయొక్క కేంద్ర కార్యాలయ భవనాలన్ని ఆ వీధిలో వుండటమే ఆ వీధికి అంత ప్రాముఖ్యత. చాల కురచ అయిన వీధి-అందుచేత అక్కడ ఒకపక్కదారిగా (one way traffic) మార్చటం జరిగింది. పొడవుకూడా అంతగాలేదు అక్కడ మొత్తంగా వున్న భవనాలు ఎనిమిది మాత్రమే. అవన్నీకూడా అంతస్థుల భవనాలు. అందుచేత-ప్రపంచ మార్కెట్టు ధరలు నిర్ణయం చేసే శక్తి యీ భవనాలలోనే వుందంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఒకపక్క బ్రాడ్వే థియేటరువుంది. యిది ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది. మరోపక్క ఈస్టునది ప్రవహిస్తూవుంది. ఇక్కడ స్టాక్ ఎక్స్చేంజి వాణిజ్య వ్యవహారాలన్ని జరుగుతూ వుంటాయి.

"మార్గన్‌బ్యాంక్" మొదలగు ప్రపంచ ప్రాముఖ్యత గలిగిన బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు యిక్కడ వున్నాయి. అంతేగాదు ప్రపంచ ఇన్సూరెన్సు కంపెనీలు. రైల్వే. ఓడలు, విమాన రవాణా సంస్థలు. వజ్రాలు. బంగారం. బొగ్గు. ఇనుము మొ॥ ఖనిజాలను ప్రపంచంలో త్రవ్వి పైకితీసే లిమిటెడ్ కంపెనీల ప్రధాన కార్యాలయాల పీఠాలు కూడా ఇక్కడవున్నాయి. లెక్కలేని కార్యాలయాలు ఒకప్రక్క. మరోప్రక్క స్టాక్ ఎక్స్చేంజి ప్రత్తి ఎక్స్చేంజి కాఫీఎక్స్చేంజి.లోహ ఎక్స్చేంజి మొ॥ ఎక్స్చేంజి పీఠాలు అక్కడ కేంద్రీకరించబడ్డాయి. ఇన్ని కార్యాలయాలకు స్థలం చాలక 'వాల్‌స్ట్రీట్' కార్యకలాపాలు పక్కవీధికికూడా పొడిగించబడ్డాయి

వాల్‌స్ట్రీట్' చరిత్ర ప్రసిద్ధి చెందినది. వాల్ స్ట్రీట్ అని మొదటి దానికి పేరు రావటానికి కారణంవుంది. మొదట్లో న్యూయార్కు నగరం డచ్చివాళ్ళవశంగా వుండేది. దాని చేరువ ప్రాంతాన్ని ఆంగ్లేయులు చేజిక్కించుకొని అభివృద్ధికి వచ్చిన కాలమది ఆంగ్లేయుల దాడి సమయంనుండి తమ స్థిరత్వాన్ని రక్షించుకోటానికి అప్పుడు డచ్చి గవర్నరుగా వుండిన పీటర్ స్టోవెసెంట్ నగరంచుట్టు గోడను కట్టవలసిందిగా ఉత్తరువు చేశాడు. 1652 సం॥లో ఈ గోడ కట్టి ముగించడం జరిగింది. అయితే-గోడ మూలంగా ఆంగ్లేయులను అరికట్టటం మాత్రం సాధ్యంకాలేదు. ఆ నగరాన్ని చేజిక్కించుకొన్నంతనే మొదటిపనిగా ఆ గోడను పడగొట్టారు. మునుపు గోడ వుండినస్థలంలో ఇప్పుడు వీధివుంది. అందుకే అది 'వాల్‌స్ట్రీట్' అయింది.

1789లో సాగిన అమెరికా స్వతంత్ర పోరాటం తరువాత. జార్జి వాషింగ్టన్‌ను ప్రెసిడెంటుగా చేసిన రిపబ్లికన్ ప్రభుత్వం మొదట్లో కొన్నిసంవత్సరాలు యిక్కడనేవుంది తరువాత వాషింగ్టన్ నగర నిర్మాణంలో జరిగిన తరువాత రాజధాని నగరం వాషింగ్టన్ నగరానికి మారింది.

వాల్‌స్ట్రీట్‌కు ఒక్కగా ఆర్థికంగా ప్రాముఖ్యత వహించే వీధిగా లండన్‌లో లాంబోర్డు వీధి చలామణి అవుతూవుంది. బొంబాయిలో దలాల్ స్ట్రీట్‌కు 'తూర్పు ఆసియా వాల్‌స్ట్రీట్' అని పిలుస్తారు.

సాక్షి

# ఏమన్నా పద్దు వినకు

మానవతను నడివీధిన
మర్డరు చేయగ జంకక -
నాగరికతకు పతకంగా
నాపాం వైరస్ బాంబులతో
ప్రపంచాన్ని పిడికిల్లో
పెట్టుక శాసిద్దామని -
కలలు గనకుమో డాలర్
కాలం నిను కరచితీరు -

★

సూర్యుడస్తమించనట్టి
సామ్రాజ్యం జారిపోవ
చూరుపట్టు కేళ్ళాడే
వూరుకోదు నేటిజగం -
కీలుకాల పట్టుసడలె
తోలుబొమ్మ బింకాడవు
అద్దంలో చూచన్నా
దిద్దుకో నీదు వునికి.

★

సహోదరుని మొగంమీద
చాకులాంటి మాటగుచ్చి
దారితప్పి పోయావని
దబాయించి దగాపెంచి
సాంస్కృతిక విప్లవమని
సాగించిన కొత్తబాట
అచ్చమైన స్వర్గానికి
నిచ్చెన్లే వంటారా ??

★

కాచివున్న ఆ పిల్లిని
కాళ్ళగట్టి మూలనెట్టి
బూచిజూపి కోళ్ళన్నిటి -
బుట్టకింద అదింపెట్టి
కోడికూత నాపలేక
వోడినట్టు వొప్పుకోనక
చెక్కపేలెక్కిన - గద్దం -
చేదే దేముంది - గీక్కో -

★

మానవులంతా ఒకటని
మహామంత్ర ముచ్చరించి
అస్పృశ్యత నింకా - ఒక
అస్త్రంగా - ప్రయోగించి,
చెప్పిందేమీ చెయ్యక
చేసిందేమీ చెప్పక
కొరివిలాగ తలగోకే
గొప్పలకిక ఆటకట్టు.

★

గాదెకింద చేరిన కొక్కులు
ఖాళీ చేశాయిగాదె
అందనివెన్నో కొక్కుల
అరుపు పేరె "పెద్ద" గోల
వాటా పెట్టకపోతే
బ్రూటు మెజార్టీలోనే
ఏమన్నా పద్దు - వినకు
ఎన్నన్నా గద్దె దిగకు.

—మురారి

వాళ్ళ బట్టలముందు అవి వెల వెలా పోతున్నాయి 'తుతుకులో ఏముంది పీటి తీరే ఇంత - నా వంటి మీద వున్న బట్టలన్నీ కలిపినా వాళ్ళ పేంటులో సగం విలువ చెయ్యవు - వాళ్ళ పైఖరీదు పెడ్తే నాకో జత బట్టలు వస్తాయి." అనిపించింది ఈ అవతారంతో దొరవగా వాళ్ళ దగ్గరకి వెళ్ళాలంటేనే ఎలాగో అనిపించింది ఒక్క క్షణం. కాని నేను బిడియపడుతూ నిలబడిపోతే లాభం లేదు. సామాను పోర్టరు నెత్తిమీద పెట్టించి వాళ్ళంతా ఖబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ ముందుకు కదిలిపోతున్నారు.

చటుక్కున కాస్త దగ్గరికి వెళ్ళి "మామయ్యా" అన్నాను గౌరవం. అభిమానం పుట్టిపడేలా మెల్లిగా.

వాళ్ళమాటల కోలాహలంతో ఆ పిలుపు ఎవ్వరి కాస్త పందుచే ఒకటి చాలామంది చెవుల్లోనే జొర బడినట్లుంది అయిదారుగురు ప్రక్కకి తిరిగి చూశారు. ముడుచుకున్న వాళ్ళ కనుబొమ్మల్లో 'ఎవరు నువ్వు?' అన్న ప్రశ్నార్థకం స్పష్టంగా కనిపించింది.

మామయ్య చూపుల్లో మాత్రం, "ఎక్కడో చూశాను అన్న భావం తృటికాలం తారట్లాడింది అంతలో గుర్తు తెలిసినట్లు తల వంకిస్తూ.

"ఓ రామకృష్ణవి కదూ - నువ్వు వచ్చావే" అన్నాడు చిరునవ్వుతో.

నా అంతరంగం పొంగిపోయింది. నేను ఫలానా అని మరోసారి చెప్పుకో అక్కర్లేకుండా మామయ్యే నన్ను గుర్తుపట్టాడు.

'నాన్న వ్రాశారు - నువ్వువస్తున్నట్లు." అన్నాను కాస్త వినువుగా.

"అవును. నాకూ చెప్పారు" అన్నాడు మామయ్య.

"నువ్వు వచ్చినపని నాకు తెలుసులే". అన్న అర్థం స్ఫురించింది నాకా మాటల్లో అయినా

"సీతో అన్ని విషయాలు మాట్లాడటానికి ఎప్పుడు వీలవుతుంది. నన్ను ఎన్ని గంటలకి రమ్మంటావు' అని అడుగుదామనుకున్నాను. కాని అంతమందిలో ఎలా అడగటం.

వాళ్ళంతా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూంటే వాళ్ళ ప్రక్కనే నడవటం తప్ప మరేం చెయ్యాలో తోచలేదు

స్టేషనుబయటకి వచ్చేసరికి నాలుగు కార్లు సిద్ధంగా వున్నాయి. ఓ దాంట్లో మామయ్య సామాను పెట్టించేస్తున్నాడు.

'ఇప్పుడు వీళ్ళ తోటి ఆఫీసు విషయాలూ అవీ మాట్లాడాలి- నువ్వు యింటికి వెళ్ళిపో."అని నాతో చెప్పిన మామయ్య వెళ్ళి కారులో కూర్చు న్నారు మిగిలిన వాళ్ళుకూడా తలో దాంట్లోనూ సర్దుకున్నారు. కార్లు కదిలిపోయాయి.

అప్పుడు గుర్తువచ్చింది నాకు. భోజనం విషయం మామయ్యతో చెప్పనేలేదు అని - నాలిక కరుచుకున్నాను -

'సరే. ఇప్పుడు వీళ్ళందరితోటి ఏదో మాట్లాడాలన్నాడుగా - ఈ పూట ఎలాగూ వీలు కాదంటాడు - కాస్సేపుండి హోటలుకి వెళ్ళి మాట్లాడితే సరి.' అనుకుని బస్సుస్టాపువేపు నడిచాను.

'ఏం - వచ్చారా మీ మామయ్య." అంది హేమ తలుపుతీస్తూ.

'ఆ వచ్చాడు."

"మరింటికి ఎప్పుడు వస్తానన్నారు - మీ విషయం ఏమైనా చెప్పారా." కుతూహలం ఆపుకో లేక అడిగేసింది.

"నయం వుద్యోగంలో చేరమన్నారా అని అడిగావుకాదు - అసలు ఏది మాట్లాడటానికీ అవకాశం లేకపోయింది - భోజనం మాటకూడ నేనసలు తనకి చెప్పనేలేదు - త్వరగా మనకి వంటకాని - అన్నంతిని హోటలుకి వెళతాను." అన్నాను.

వంటపని చూసుకుంటూనే మధ్య మధ్య ప్రశ్నలు వెయ్యటం మొదలుపెట్టింది. మామయ్య అసలు నన్ను గుర్తుపట్టాడా, స్టేషనుకి ఇంకెవరైనా వచ్చారా అంటూ.

నేను బట్టలు మార్చుకుని కాళ్ళు కడుక్కుని వంటింట్లోనే ఓ పీట వాల్చుకు కూర్చున్నాను. ఆ ప్రశ్నలకన్నింటికి తాపీగా సమాధానాలు చెప్పడానికి.

భోజనంముగించి బయలుదేరబోతూంటే హేమ అడిగింది "మరి ఆయనెప్పుడొస్తున్నారో నాకెలా తెలుస్తుంది-మీరు హఠాత్తుగా వెంట పెట్టుకువస్తే అప్పటికప్పుడు ఏం చెయ్యటానికీ కుదరదుకదా"

(ఇంకావుంది)

# మామయ్య వస్తాడు

ఉన్నవ విజయలక్ష్మి

(గతసంచిక తరువాయి)

"నిజమే ఆ మాట కాని, నేనైనా మామయ్యని కలుసుకోందే ఏం చెప్పగలను?" అన్నాను.

'సరే ఓ పని చేస్తాను. మధ్యాహ్నానికి ఓ స్వీటూ, హాటూ తయారుచేసి వుంచుతా. ఆయన ఏ సాయంకాలమో వస్తానంటే కాఫీతో పాటు ఇవ్వొచ్చు. లేదంటే రాత్రి భోజనంలో వడ్డిస్తా" అని ఓ వుపాయం చెప్పింది.

"బాగుంది ఐడియా సరే వస్తాను" అని చెప్పి బయటపడ్డాను.

రెండు బస్సులుమారి ఆపైన ఫర్లాంగు దూరం నడిచి హోటల్ చేరుకునేసరికి పదకొండు దాటింది.

మామయ్య పేరుచెప్పి. ఏ రూమ్‌లో వున్నారు అని అడిగాను రిసెప్షనిష్టుని.

'రూమ్ నెంబరు నైన్-ఆయనెక్కడికో వెళ్లారు. ఎవరైనా వస్తే రెండు గంటలకి వస్తానని చెప్పమన్నారు-మీ కార్డుఇచ్చి వెళ్ళండి" అంది.

నా ప్రాణం ఉసూరుమంది "కార్డు అక్కర్లేదు రెండు గంటలకి మళ్ళీ వస్తాను" అనిచెప్పి వెనక్కి తిరిగాను. మళ్ళీ ఇంటికి వెళ్ళిరావటం అంటే ఉత్త హైరానేతప్ప మరేం వుండదు అనుకుని కాస్సేపు ఓ స్నేహితుడితో బాతాఖానీ కొట్టివద్దామని బయలుదేరాను దగ్గరలోనేవున్న వాళ్ళఆఫీసుకి నేను మళ్ళీ తిరిగి వచ్చి అడిగే సరికి, "ఆ-ఇప్పుడే వచ్చారు - ఇంకెవరూ లేరు. వెళ్ళండి" అన్నాడు రూమ్ బాయ్.

పరవాలేదు. కాస్త నిదానంగా అన్ని సంగతులూ మాట్లాడుకోవచ్చు అనుకుంటూ వుత్సాహంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి బెల్లు నొక్కాను.

"ఏరా, మళ్ళీ ఎందుకొచ్చావు ఇంత దూరం." అన్నాడు మామయ్య నన్ను చూస్తూనే.

'ఏదీ ఉదయం సరిగ్గా మాట్లాడనేలేదు. కాస్త తీరుబడిగా వుంటారేమోనని పదకొండు గంటలకి వచ్చాను. నువ్వు లేవు" అన్నాను.

"సరేలే తీరికకూడానా-వచ్చిందగ్గిర్నుంచి ఒక్క క్షణంకూడ విశ్రాంతి అనేది లేదు. ఏమో ఆఫీసు పనులూ అవీ అంతా హడావిడి. ఇంతకు ముందే వచ్చానా. మళ్ళీ ఓ అరగంటలో చాంబర్ ఆఫ్ కామర్స్ వాళ్ళతో టీ వుంది. ఆ తరువాత ఇంకో మీటింగు-అది అవుతూనే సాయంకాలం ప్లేను అందుకోవాలి" అన్నాడు. అతను మాట్లాడుతూంటే ప్రొద్దుటికంటె కాస్త అలసటగా అదోలా వున్నట్లనిపించింది. అలసటకాదుమరి. ఉదయం రైలు దిగిన మనిషి సాయంకాలం ప్లేనులో తిరుగు ప్రయాణానికి సిద్ధంకావాలి. ఈ లోగా మీటింగులూ. టీ పార్టీలూ అంటూ వూపిరిసలపనన్ని ప్రోగ్రాములు. అవి చాలవన్నట్లు ఏమో పనులుండి మాట్లాడటానికి వచ్చేవాళ్ళూ పోయేవాళ్ళూనూ. మనిషికి క్షణం విశ్రాంతి అనేది వుండదు.

వేలకివేలు జీతం వస్తుందికాని దానికి తగినట్టే బాధ్యతలూ వుంటాయిమరి - ఫస్టుక్లాసుల్లోనూ. ప్లేనుల్లోనూ ప్రయాణాలు చేస్తారు. ఎయిర్‌కండిషన్లు హోటళ్ళల్లో మకాం వేస్తారు. కాలు క్రింద పెట్టక్కర్లేకుండా కార్లూ టాక్సీలు హాజరుగా వుంటాయి అని అనుకుంటామేకాని వాళ్ళ పడేశ్రమ ఎవ్వరికీ తెలియదు అనిపించింది. నేను రాకపోతే ఈ అరగంటా కళ్ళు మూసుకుని పడుకునే వాడేమో పాపం - ఆ అవకాశంకూడా లేకుండా చేశాను అనుకున్నాను.

'సాయంకాలమే వెళ్ళిపోతున్నావా? ఓపూట మా ఇంట్లో వుంటావనుకున్నాం..." అని నేనంటూంటే.

"నయమే. నాకెక్కడ వీలవుతుంది." అన్నాడు మామయ్య.

' ఇంక భోజనానికెలాగా వీలుకాదనుకో-సాయంకాలం సరదాగా మాతో కాఫీ టిఫిన్ తీసుకుందువుగాని. ఇక్కడి నీ పనులయిపోయాక టాక్సీలో వెళ్ళి వచ్చేద్దాం. అట్టే ఆలశ్యం కాదు" అన్నాను బతిమాలుకుంటున్న ధోరణిలో.

"అబ్బే-వీలవదురా. ఏదో నువ్వు వచ్చావు. చూశావు. మీ ఆవిడ్ని ఈ సారెప్పుడయినా చూసిద్దువుగాని." అన్నాడు ఘా లేసుకుంటూ.

అప్పుడే తను ప్రయాణం అవుతున్నట్లున్నాడు. నేను వచ్చిన అసలు సంగతి బయట పెట్టాలి అనుకున్నాను.

'నా విషయం కాస్త గుర్తుపెట్టుకుంటావుకదూ. నువ్వు తలచుకుంటే తప్పకుండా అవుతుంది." అన్నాను ఆశగా మామయ్య కళ్ళల్లోకి చూస్తూ

'నేనున్నానద్బాయి. నీకేం భయంలేదు. నీకు ఏదో ఓ వుద్యోగం చూపించే పూచీనాదీ." అంటాడనుకున్నాను, కాని మామయ్య ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు తరువాత నావంక అదోలా చూస్తూ అన్నాడు. "మీరంతా అలాగే అనుకుంటారు. మా అవస్థలు మీకు అర్థంకావు, ఒక్క ఖాళీవుంటే వెయ్యి అప్లికేషన్లు వస్తాయి. అంతా పోస్టుగ్రాడ్యుయేట్సు, ఫస్టుక్లాసు గ్రాడ్యుయేట్సూను. అందులో కొందరు రామబాణాల్లాంటి రికమెండేషన్లు తీసుకుని మరీవస్తారు. ఇలాంటి పరిస్థితిలో నేను నీకేం చేయగలనో నాకే తెలియటంలేదు - సరే చూస్తాలే - అయినా నామీదే ఆశలన్నీ పెట్టుకు కూర్చోకు - నీ ప్రయత్నాలు నువ్వు చేసుకుంటూ వుండు". ఉద్యోగపు హోదా తెచ్చిపెట్టిన దాబూ దర్పం అంతా ఆ మాటల్లో ఇమిడ్చిపెట్టినట్లనిపించింది. నా మనస్సు చివుక్కుమనిపించింది. పైగా అంత నిరుత్సాహంగా మాట్లాడటంతో ఇంకా కృంగిపోయాను-అయినా ఈ వూళ్ళో తనకి తెలిసినవాళ్ళెవరికైనా వుత్తరం రాసిఇమ్మని అడుగుదామనుకున్నాను. నేను ధైర్యంచేసి నోరు విప్పేలోపున ఫోను మోగింది. మామయ్య రిసీవరు అందుకుని అయిదు నిమిషాలపాటు ఏవేవో మాట్లాడాడు. ఆ తరువాత నేను మళ్ళీ పెదవివిప్పే లోపునే మరో అవాంతరం వచ్చింది. రూమ్‌బాయ్ ఓ విజిటింగ్‌కార్డు తెచ్చి మామయ్య చేతిలో పెట్టాడు. అది చూసుకుంటూనే అతను సంబరంగా పొంగిపోతూ.

"తీసుకురా." అని బాయ్‌ని అజ్ఞాపించి తను గది గుమ్మందగ్గరే నిలబడ్డాడు వాళ్ళని ఆహ్వానించి లోపలికి తీసుకురావటానికి.

కాస్సేపటిలోనే వాళ్ళు వచ్చారు. భార్య భర్త. పదేళ్ళమ్మాయి - ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకోటం అయాక.

'ఆనందరావుగారని నేను ఇంగ్లండు వెళ్ళినప్పుడు ఈయన అక్కడే వున్నాడు. ఆ సంవత్సరం అంతా ఇద్దరం కలిసే వున్నాం." అంటూ ఆయన్నిగురించి చెప్పి "మానెవ్యూ" అంటూ నన్ను చూపించాడు.

'ఇప్పుడే రావాలా వీళ్ళు" అనుకుంటూనే, మర్యాదకి భంగం రాకుండా రెండు చేతులూ జోడించాను.

వాళ్ళూ ప్రతి నమస్కారాలు పడేసి ఇంక మామయ్యతో కబుర్లలో మునిగిపోయారు. వాళ్ళ సంభాషణ కొంతసేపు, ఇంగ్లండులో వుంటున్న వాళ్ళ స్నేహితులని గురించి జరిగింది - పోయిన సంవత్సరం ఆనందరావుగారి కుటుంబం కాశ్మీర్ వెళ్ళినప్పటి సంగతులని గురించి మరికొంచెంసేపు మాట్లాడుకున్నారు - ఆ తరువాత మాటల సందర్భంలో మామయ్య ప్రోగ్రాం గురించి తెలుసుకుని "నో, నో అలా వీల్లేదు. మా యింట్లో కనీసం



ఛీ అయినా తీసుకువెళ్ళాలి" అంది అనిత.

"ఎన్ని గంటలకి వీలవుతుందో చెప్తే కారు తీసుకువస్తాను" అన్నాడతను.

"అంకుల్ ఇప్పుడు మనింటికి రాకపోతే రేపు ఢిల్లీ వెళ్ళినప్పుడు మనమూ వాళ్ళింటికి వెళ్ళొద్దు" అంది అమ్మాయి గారంగా.

మామయ్య ఆ పాప బుగ్గ నిమిరి, నవ్వుతూ- 'బేబీ పెట్టిన కండిషన్ బాగుంది. సరే ఫైవ్‌కి వస్తాను. ఫైవ్ మినిట్సు కంటె ఎక్కువ స్పేర్ చెయ్యలేను" అన్నాడు.

"ఓ.కె" అంటూ ఏక కంఠంతో అంగీకారం తెలిపారు ఆ దంపతులు.

'ఇంటికేమో అల్టరేషన్సు చేయించాలని ప్లాను. పనులు పూర్తయ్యాయా-మొత్తం ఎంత మంది.' అని అడిగాడు మామయ్య అప్పుడే ఆ విషయం గుర్తుకొచ్చినట్లుంది.

'ఆ-పనులన్నీ అయిపోయాయి-మొదట లక్ష యాభై వేలు పెట్టి కొన్నాను. మరో నలభై వేలు

అయింది. మనకి కావలసిన విధంగా మార్పులు చేర్పులు చేయించుకునేసరికి సరే-కొత్త యింటికి కొత్త ఫర్నీచరు కావాలనుకున్నాం - అదికూడా కలుపుకుంటే రెండు లక్షలపైనే అయింది." అన్నాడు తను లెక్కలువేసి తేల్చిచెప్తూ.

అంతసేపూ నేను వాళ్ళ మాటలువింటూ కూర్చోటమేతప్ప ఏ విధంగానూ జోక్యం కలిగించుకోలేకపోయాను వాళ్ళ సంభాషణలో- వాళ్లుకూడ నేనక్కడ కూర్చున్నాననే విషయమే మరిచిపోయినట్లు వాళ్ళ ధోరణిలో వాళ్ళున్నారు.

"వీళ్ళు త్వరగా వెళ్ళిపోతే బాగుండును- మామయ్య వెళ్ళిపోయేలోపునే మరో రెండు మాటలు చెప్పుకోటానికి వీలవుతుంది." అని క్షణాలు లెక్కపెట్టుకుంటూ కూర్చున్న నాకు మరో ఇద్దరు పెద్ద మనుష్యులు గదిలోకి రావటంతో మరీ ఆశాభంగం అయిపోయింది. ఉదయం స్టేషనుకి వచ్చినవాళ్ళల్లో వీళ్ళిద్దరూకూడ వున్నారు.-'ఇప్పుడు మామయ్యని వెంటపెట్టుకు వెళ్ళటానికి వచ్చారన్నమాట" అనుకున్నాను.

మామయ్య బాయ్‌ని పిలిచి అందరికీ కాఫీ బిస్కట్లు ఆర్డరు చేశాడు. అవి తీసుకున్నాక అందరం బైటకి వచ్చాం.

'సరే - ఫైవోక్లాక్‌కి నేనొచ్చి నిన్ను తీసుకు వెళ్తాను." అన్నాడు ఆనందరావు మామయ్యతో.- ఆ కుటుంబం అతని దగ్గర శెలవు తీసుకుని కారు వేపు నడిచింది.

'వస్తానురా-నాన్నకి వ్రాయి నేను వచ్చి వెళ్ళినట్లు." అంటూ నాతో చెప్పి మామయ్య మిగిలిన వాళ్ళతో పాటు వెళ్ళి కారులో కూర్చున్నాడు. చూస్తుండగానే రెండుకార్లు కదిలిపోయాయి.

నేను బస్సుస్టాపువేపు నడకసాగించాను అడుగులు వుత్సాహంగా పడటంలేదు. ఏదో నీరసం నన్ను ఆవరించుకున్నట్లు. మరెంతో బరువు నన్ను క్రిందికీడుస్తున్నట్లు మెల్లిగా భారంగా నడుస్తున్నాను. నా మనస్సులో ఇదీ అని చెప్పలేని వెలితి ఏర్పడి అంతకంతకి అధికం కాసాగింది.

'మామయ్య వస్తాడు, వస్తాడు." అని ఎదురు చూచినంతసేపు పట్టలేదు. రావటం అయింది - కాస్సేపటిలో వెళ్ళిపోతాడు కూడ - నేను కలుసుకోటం మాట్లాడటం అయిపోయింది - కాని నేను ఆశించినట్లు మాత్రం కాలేదు - ఎవరో తన కాళ్లూ చేతులూ బంధించేసినట్లు తన చేతిలో ఏమీలేనట్లు చెప్పాడేకాని నిజంగా తను తలుచుకుంటే నాలాంటి వాడికో చిన్న ఉద్యోగం చూపించలేడా - పైగా పోస్టుగ్రాడ్యుయేట్లు, ఫస్టుక్లాసు గ్రాడ్యుయేట్లు కూడ తనచుట్టూ తిరుగుతున్నట్లు గొప్పలు చెప్పుకోటం ఎందుకు - నువ్వు ఆ తైసరు మార్కులతో ప్యాసై ఉత్త డిగ్రీ తెచ్చుకున్నవాడివి, నీ మొహానికి ఉద్యోగం ఎవరిస్తారని చెప్పటానికా.

ఏమిటో గంపంత ఆశపెట్టుకు వచ్చాను - ఏదో పరాయివాడితో మాట్లాడినట్లు మాట్లాడాడే కాని ఆ నాలుగు మాటల్లోనూ ఆత్మీయతా, అభిమానం ఏం లేవు అనిపించింది.

నాతో విసుగ్గా అలసటగా మాట్లాడిన మామయ్య ఆనందరావు కుటుంబాన్ని చూడటంతోనే వుత్సాహంగా నవ్వుతూ కేరింతలాడుతూ వాళ్ళతో కబుర్లు చెప్పాడు.

మా యింటికి రావటానికి క్షణం తీరిక లేదు కాని ఆనందరావింటికి వెళ్ళటానికి తహతహలాడి పోయాడు. అవును మరి - ఆయనంటే ఇంగ్లండు వెళ్ళివచ్చినవాడు. రెండు లక్షలు పెట్టి ఇల్లువాకిలి కొనుక్కున్న వాడు.

నాకేముంది?

'హు. ఈ డబ్బుగల వాళ్ళతీరే అంత. తమ హోదాకి, అంతస్తుకి తగినవాళ్ళతోనే భుజంభుజం రాసుకు తిరుగుతారు. చేయిచేయి కలిపి కబుర్లు చెప్తారు. డబ్బులేనివాళ్ళు అసలు వాళ్ళకంటికే కానరు. వాళ్ళు బంధువులయినాసరే ప్రేమలు అభిమానాలూ ఏమీ వుండవు అనిపించింది.

ఈ నెల అంతకీ సరిపోయే నెయ్యి, నూనె ఖర్చుచేసేసి పిండివంటలు వండుతున్న హేమ గుర్తుకొచ్చింది.

"ఇంట్లో కడుపులు కట్టుకుని, చారు అన్నం తిని ఎలాగో కాలక్షేపం చేస్తున్న స్థితిలో ఐశ్వర్య

---

ఒక పిసినారి సేఠ్‌జీ యింట్లో ఒక అర రాత్రి ఓ గజదొంగ దూరాడు. సరాసరి సేఠ్ దగ్గరకి వచ్చి "డబ్బిస్తావా? నీ ప్రాణాలు తీయమంటావా?" అని బెదిరించాడు.

"ముసలి ముప్పున నన్నెవరు చూస్తారు? అందుకే నా డబ్బు దాచుకుంటున్నాను. డబ్బుమాత్రం యివ్వను. కావాలంటే నా ప్రాణాలే తీసుకుపో" అన్నాడు సేఠ్‌జీ.

---

వంతుడయిన అతిథికోసం వళ్లు తెలియకుండా ఖర్చుచేసేశాం. అతనికి మా అభిమానం ఆతిథ్యం అక్కర్లేదు." అనుకున్నాను.

ఇల్లు చేరుకున్నాను. తలుపులు తెరిచేవున్నాయి. కర్టెన్ తొలగించుకుని లోపల అడుగుపెట్టాను. నా అడుగుల చప్పుడు విని వంటింట్లోంచి ఇవతలకి వచ్చింది హేమ. 'ఎప్పుడయినా ఫంక్షన్స్‌కి కట్టుకుంటాను." అని అపురూపంగా దాచుకున్న హాకోబాచీరలో ముస్తాబయి వుంది.

నే నొక్కడ్నే మంచంమీద కూలబడటం చూసి, "ఆయన ఇప్పుడు రానన్నారా" అంది.

"ఉహూ- ఎప్పుడూరాడు- ఆయనకి పూసిరి కలవన్ని ప్రోగ్రాములు. తీరుబడిలేదు. అయినా మనమేం లక్షాధికార్లమా. కోటీశ్వరులమా-మనింటికెందుకు వస్తాడు" అన్నాడు విసుగ్గా.

'అసలేం జరిగిందండీ." అంది హేమ చిత్తర పోతూ.

"ముందు కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు.' అన్నాను.

'కాఫీ కలపనా?" అంది మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ.

"ఇప్పుడేంవద్దు. అని గ్లాసు ఖాళీచేసి తనచేతికిచ్చేసి వెనక్కివాలి పడుకుని కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకున్నాను.

ఆ స్థితిలో నన్ను ఇంక ఏమీ అడగలేక వూరుకుంది హేమ. కొద్ది క్షణాలు గడిచిపోయాయి. మెల్లిగా చెయ్యి ఒత్తిగించి చూశాను. బితుకుబితుకుమంటూ నావంక చూస్తూ కూర్చుంది హేమ ఎదురుగా ఓ కుర్చీలో.

పాపం తనకి మాత్రం ఏం జరిగిందో తెలుసుకోవాలన్న కుతూహలం వుండదా. అనిపించి లేచి కూర్చున్నాను. ఉదయంనుండి జరిగిందంతా చెప్పాను.

"ఇప్పుడనిపిస్తోంది. అసలు ఉదయంకూడా మనస్సువిప్పి ఆప్యాయంగా అతను మాట్లాడలేదు. ఏదో మొక్కు తీర్చుకున్నట్లు పలకరించాడంతే. దానికే ఎంతో పొంగిపోయి మళ్ళీ వెంటపడ్డాను." అన్నాను కసిగా.

హేమ ఏదో అనబోయింది. ఇంతలో బయట నుంచి 'రామకృష్ణ బాబూ అన్నపిలుపు వినిపించింది. ఆ గొంతు వరదరాజుది.

"అబ్బ ఇతనొకడు. పానకంలో పుడకలా - ఏమీ తోచకపోతే ఇక్కడికి వచ్చి వుట్టినే కబుర్లు పెట్టుక్కూర్చుంటావు. తను రావటం ఇవతలి వాళ్ళకి ఇష్టం అవునో కాదోకూడా గ్రహించుకోడు అనుకుంటూ హేమవంక చూశాను. తనుకూడా సరిగ్గా అదే అర్థం వచ్చేలా మొహం చిట్లించుకుంటూ నావంక చూసింది.

మా దగ్గరనుంచి ఎలాంటి సమాధానం రాకపోవటంతో. "అతను ఇంట్లో లేరా అమ్మా" అన్నాడు వరదరాజే మళ్ళీ.

ఇంక తప్పదన్నట్లు లేచివెళ్ళి, కర్టెన్ వత్తిగిస్తూ 'రండి అని ఆహ్వానించాను.

హేమ కుర్చీ ఖాళీచేసి అతన్ని కూర్చోమని చెప్పి తను వంటగదిలోకి వెళ్ళిపోయింది - ముూ-తున్న మొహం కాస్త ఇవతలకి జరుపుకుని కూర్చున్నాను నేను.

"ఏమండోయ్ - మాకు పార్టీ ఇవ్వాలిమరి" ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా వరదరాజు నోట్లోంచి వచ్చిన మాటలివి-అతను అమాయకంగా అభినందన పూర్వకంగా నా వంక చూసి నవ్వుతూంటే ఒక్క క్షణం తెల్లబోయాను. అంతలో గుర్తువచ్చి నా వంటికి కారం రాసుకున్నట్లయింది.

ఛ-ఈ ఆడవాళ్ళ నోట్లో ఏ మాటా దాగదు. మామయ్య వస్తున్నట్లూ, నాకేదో పెద్ద ఉద్యోగం వస్తున్నట్లు అప్పుడే అందరికీ చాటించేసింది కాబోలు ఈవిడగారు అనుకున్నాను విసుగ్గా. మళ్లీ అంతలోనే అనిపించింది. హేమ అలా బడ బడ వాగే మనిషికాదు. అసలు నా ఉద్యోగం పోయిన సంగతికూడ ఎంతో గోప్యంగా వుంచాంకొన్నాళ్ళు. మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలలో మీరంతా తిరుగుతున్నా అదివరకులా పదింటికి వెళ్ళటం అయిదు గంటలకి రావటం అదీ లేకపోవటంతో అనుమానం తోచింది కాబోలు ఆ సుబ్బమ్మగారు ఆరాలు తీస్తూ ప్రశ్నలతో వేధించేసరికి విసుగొచ్చి చెప్పేసిందట హేమ. అంతేకాదు అసలు నేనే ఆ ఉద్యోగం నచ్చక మానేశానని అందుకోసం మేము కించిత్తుకూడ విచారించటంలేదని అన్ని విధాల దానికన్న మంచి ఉద్యోగం సంపా

వించుకోగలననే ధైర్యం నాకుండనీకూడ చెప్పింది. మొన్న డబ్బుకి ఇబ్బంది అయినాకూడ మరో స్నేహితుడిని అడిగి తీసుకున్నానేకాని వాళ్ళెవరినీ అడగబుద్ధికాలేదు. అందరివీ అంతంత మాత్రం సంపాదనే. నాకు యాభై వందలు అప్పులివ్వ గలిగేశక్తి వాళ్ళకేమీ వుండనూ వుండదు. కాక పోయినా ఉద్యోగం లేకపోయినా డబ్బుకి ఇబ్బంది పడకుండా గడుపుకోగలుగుతున్నాం అంటే దాని కుండే గొప్పా, విలువా అవి వేరుమరి. ఇవాళ కూడా ఆ అమ్మలక్కలెవరో వచ్చి కూర్చున్నా రేమో-మాటల సందర్భంలో మామయ్య విషయం బయట పెట్టవలసి వచ్చిందేమో." అంటూ సాగి పోతున్నాయి నా ఆలోచనలు.

"ఏమిటలా చూస్తున్నారు, నేను శుభవార్త పట్టు కొచ్చాను. మరి టీ పార్టీ అడగొద్దూ." అన్నాడు వరదరాజు నాకళ్ళల్లోకిచూసి స్వచ్ఛంగా నవ్వుతూ.

"శుభవార్తా." కనుబొమ్మలు ముడిచి ఆశ్చర్యం గానూ కుతూహలంగానూ అడిగాను.

"ఆ, అవును. మా ప్రొప్రయిటర్ తమ్ముడికి సనత్‌నగర్‌లో ఓ పౌండ్రీ వుందని అప్పుడు చెప్పానుకదూ..."

"ఔను, గుర్తువుంది." అన్నట్లు తల ఆడిం చాను. ఈ వరదరాజు హిమాయత్‌నగర్‌లో ఓ వర్కుషాపులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆ వర్కుషాపు ప్రొప్రయిటర్ తమ్ముడికి సనత్‌నగర్‌లో ఓ పౌండ్రీవుందనీ ఆ అన్నదమ్ములిద్దరూ బాగాడబ్బు గడించుకుంటున్నారనీ అప్పుడెప్పుడో చెప్పాడు. అయితే ఇప్పుడు ఏమంటావు అన్నట్లు చూశాను వరదరాజువంక.

"ఆ పౌండ్రీలో కరస్పాండెన్సు అదీ చూసు కుంటూ ఎకౌంట్లు అవీ రాసే మనిషి మానేశాడట అతనికింకేదో పెద్ద ఉద్యోగం వచ్చిందిట - సరే. మరో మనిషికోసం పేపరో ఎడ్వర్టయిజు చేద్దామను కుంటున్నారుట - మా వాడొకడు చెప్పాడు - ఆ రావుగారు మధ్యాహ్నం మా వర్కుషాపుకి వచ్చాడు. అన్నగారితో మాట్లాడటానికేమో - అప్పుడు నేను వెళ్ళి వాళ్ళని కలుసుకుని మీ మాట చెప్పాను - సాయంకాలం ఇంటికి తీసుకురా మాట్లాడతాము అని చెప్పారు. ఈ మాటలు ముచ్చట్లు అన్న పేసుకే లెండి - మీకా ఉద్యోగం వచ్చేసినట్లే - ఇక్కడనుంచి రోజూ అంత దూరం పోయిరావ ల్సిన పనికూడ లేదు - ఆ ముందాయన ఖాళీచేసిన క్వార్టర్సు వున్నాయి. మీకేమీ అభ్యంతరంలేక పోతే అంటే ఈపాటికే ఇంకెక్కడా మాట ఇవ్వటం అయిపోకపోతే ఇప్పుడు మనిద్దరం వెళ్ళి ఆయన్ని కలుసుకుందాం..." వరదరాజు చెప్పుకుపోతున్నాడు.

వింటున్న నేను ఏమిటోగా అయిపోయాను - కాకు - నాకు అభ్యంతరమా - కాళ్ళు అరిగిపోయే ట్లు ఆఫీసులచుటూ తిరిగి అందరిచేతా లేదు అనిపించుకున్న నేను ఆ మాట వీళ్ళకి చెప్పగలనా. నిజంగా ఈ వరదరాజు నాకెంత సహాయం చేశాడో, దానికివున్న విలువేమిటో నేను మాటలో చెప్పలేను. అతనిపట్ల కృతజ్ఞతాభావంతో నాలో అణువణువూ స్పందించింది - అయినా అతని కళ్ళల్లోకి సూటిగా చూడాలంటే ఏమిటో ధైర్యం చాలటంలేదు. సిగ్గుతో నా తల వాలి పోతోంది. ఇన్నాళ్ళూ వీళ్ళందర్నీ మేమెంత తేలి కగా చూశామో, మాతో స్నేహంగా వుండాలని సరదాగా కబుర్లు చెప్పాలనీ ముచ్చటపడే వీళ్ళని మేమెంత చిన్నచూపు చూశామో తలుచుకుంటూంటె సిగ్గుతో బాధతో అసలు తల ఎత్తలేకపోతున్నాను.

హు. నా దృష్టి ఎంతసేపూ పైవాళ్ళమీదే. వాళ్ళ స్నేహంకోసం ప్రాకులాడుతూ తిరిగానే కాని నా కంటె తక్కువ వాళ్ళమీద అసలు నా దృష్టే ఆనలేదు. అయినా పాపం వీళ్ళ దేమీ పట్టించుకోలేదు. అవసరంలో వున్నవాడికి తమ చేతనయిన సహాయం అందించడానికి వాళ్ళు సిద్ధంగా వున్నారు.

ఆ సనత్‌నగర్‌లో క్వార్టర్సుని నేను చూశాను. అన్ని హంగులతోటి, సౌకర్యాలతోటి ఎవరికివారికి ప్రత్యేకంగావున్న ఇళ్ళు అవి నేనేం కష్టపడక్కర్లే కుండానే అలాంటి ఇల్లు ఒకటి దొరుకుతుంది నాకు. సంతోషంతో కొద్ది క్షణాలు నాకు నోటిమాట రాలేదు.

ఏమిటి ఆలోచిస్తున్నారు." అన్నాడు వరద రాజే మళ్ళీ

"భలే వారే. ఇంకా ఆలోచనేంవుంది. మీకు నా కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో తెలియటంలేదు. ఇప్పుడే అయిదు నిమిషాలలో వెళ్ళి ఆ రావుగారిని కలుసుకుందాం" అని ఆయనతో చెప్పి

"హేమ - వరదరాజుగారికి టిఫిన్‌ప్లేటా" అని లోపలికి కేకవేశాను.

నేను మొహం కడుక్కు వచ్చేలోపునే హేమ రెండు ప్లేట్లలో మైసూరుపాకూ బజ్జీలు తెచ్చి పెట్టింది. రెండు గ్లాసులతో మంచినీళ్ళుకూడా తెచ్చి కాఫీ కలపటానికి లోపలికి వెళ్ళింది.

నేనులేచి యాపిల్‌పండు, చాకు అందుకున్నాను. అవన్నీ ఎవరికోసం ఆర్భాటంగా అమర్చిపెట్టామో గుర్తుచేసుకుంటూ, రాబోతున్న సిట్టూర్పుని అదిమి పెట్టాను.

యాపిల్ కోసి ముక్కలు ప్లేట్లలో సర్ది "తీసు కోండి" అంటూ ఓ ప్లేటు వరదరాజు చేతి కందిం చాను.

సరదాగా అవీ ఇవీ మట్లాడుతున్న వరదరాజు కేసి స్నేహాభిమానాలతో చూస్తూ, "ఏమిటోనండి. మీ అందరికి దూరంగా వెళ్ళిపోతామంటె ఎలాగో వుంది." అన్నాను - ఏదో యధాలాపంగా, మాట వరసకిఅన్న మాటలు కావవి. ఈ ఇల్లు ఇందులో మనుష్యులు నాకెంతో ఆత్మీయులుగా కనిపిస్తున్నా రిప్పుడు - నేను ఆశించిన దగ్గర పొందలేకపోయినా ప్రేమాభిమానాలు వీళ్ళ దగ్గర దొరికాయి.

★

# పాతచమ్ములో కొత్తకథ

అనగనగా ఓరాణి. ఆ రాణికి ఏడుగురు మంత్రులు. ఏడుగురు దేశాటనకు వెళ్ళారు. ఏడు ఫిర్యాదులు తెచ్చి రాణిముందు పెట్టారు. అందులో ఒకటి 'తిండిలేద'న్న ఫిర్యాదు.



'అయ్యో! పాపం! ప్రజలు తిండిలేక బాధపడుతున్నారా' అని రాణి స్వయంగా ఫిర్యాదును పరిశీలించింది. ప్రజలపిలిచి అడిగింది - 'ఎందుకు తిండిలేద'ని.

'ధరలు అడ్డమొచ్చాయ'న్నారు ప్రజలు'

'ధరలెందుకు పెరిగాయి?'

'కరువొచ్చింది కనుక'

'కరువెందు కొచ్చింది?'

'మంత్రులు ప్రజలసొమ్మంతా తిన్నారు కనుక.'

'మంత్రులారా! అలాఎందుకు తిన్నారు?'

'ఎలక్షన్‌సొమ్ము రాబట్టుకోవాలి- యింకా లాభం చూసుకోవాలి కదా?'

'ఎలక్షన్లలో అంతగా ఎందుకు ఖర్చు పెట్టారు?"

'పదవికోసం'

'ఎందుకీ పదవి నీకు?'

'రాణీ! నీకు పట్టం కట్టడానికే.'

—గజ్జల దక్షిణామూర్తి